క్లుప్తంగా

పవన్ వ్యాఖ్యలు అర్థరహితం


కూనపరెడ్డి రంగారావు

నరసాపురం రూరల్: తనకు ఎవరి సూచనలు, సలహాలు అక్కరలేదని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని నరసాపురం సర్పంచ్‌ల చాంబర్ మండల మాజీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీర విజయ రంగారావు అన్నారు. గురువారం స్థానికంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. తాడేపల్లి గుడెంలో టీడీపీ, జనసేన పార్టీలు బుధవారం ఉమ్మడిగా నిర్వహించిన జెండా సభలో పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఎంతోమందిని బాధించాయన్నారు. సీనియర్ రాజకీయ నాయకుడైన మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య సూచనలను తనకు అక్కర లేదని పవన్ నిర్లక్ష్యంగా చెప్పడం తగదని కూనపరెడ్డి రంగారావు హితవు పలికారు. నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఇదే సభలో తాను తిరిగి ఇదే స్థానం నుంచి ఎంపీగా పోటీ చేస్తున్నానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెనుమంట్ర: పెనుమంట్ర సబ్ స్టేషన్ పరిధిలో మాముడూరు ఫీడర్‌కు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈఈ బి.సురేష్ కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో మాముడూరు, నత్తారామేశ్వరం గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ


మంచినీటి చెరువు గట్టున పునర్నిర్మించిన శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయం

యలమంచిలి: స్థానిక మంచినీటి చెరువు గట్టున పునర్నిర్మించిన శ్రీ భక్తాంజనేయ స్వామి, శ్రీ గణపతి విగ్రహ, శిఖర, జీవ ధ్వజ ప్రతిష్ఠలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. వైఖానస ఆగమ మహదాచార్య ఖండవల్లి సూర్యనారాయణచార్యులు (రమణబాబు) బ్రహ్మత్వంలో వైఖానస ఆగమ విధానంలో ప్రతిష్ఠ కార్యక్రమం చేశారు. ఏకశిలతో ఏర్పాటుచేసిన ధ్వజస్తంభం ఆకట్టుకుంది. ప్రతిష్ఠ అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులందరికీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

సువర్ణగౌరి సేవలు అభినందనీయం


సువర్ణగౌరి దంపతులను సత్కరిస్తున్న ప్రభుత్వవిప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

పెనుమంట్ర: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతపెనుమంట్ర జెడ్పీహైస్కూలు ఉపాధ్యాయిని పడాల సువర్ణగౌరి ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని ప్రభుత్వ విప్ కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. పడాల సువర్ణగౌరి పదవీ విరమణ సందర్భంగా గురువారం రాత్రి పెనుమంట్ర హైస్కూల్లో సత్కారసభ నిర్వహ/ ంచారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జగ్గిరెడ్డి పాల్గొని మాట్లాడారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కె.సాయి సూర్యనారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఎంపీటీసీ సభ్యులు గండి రామారావు, ఉపసర్పంచ్ భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, గ్రామకమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామానాయుడు నోరు అదుపులో పెట్టుకో


ఉచ్చుల స్టాలిన్

యలమంచిలి: ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మైక్ దొరికింది కదా? అని ఇష్టానుసారం మాట్లాడితే సహించమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన నాయకులు ఉచ్చుల స్టాలిన్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెంలో జరిగిన సభలో రామానాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రామానాయుడు 20 శాతం కమీషన్ తీసుకుని ఆ డబ్బుతో తన తండ్రి పేరుతో ఫౌండేషన్ నడుపుతున్నారని స్టాలిన్ విమర్శించారు. తనలా అందరూ చేస్తారనుకోవడం నిమ్మలకు అలవాటుగా మారిందన్నారు. ప్రచారం పేరుతో రామానాయుడు వేస్తున్న డ్రామాలు చూసి సొంత పార్టీ కార్యకర్తలే విసుక్కుంటున్నారని విమర్శించారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట


ఆచంట వేమవరంలో డ్రెయిన్ నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశామని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం ఆచంట వేమవరంలో రూ.45 లక్షల జిల్లా పరిషత్ నిధులతో డ్రెయినేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలోనూ డ్రెయినేజీ, రహదారుల నిర్మాణాలు చేశామన్నారు. ముఖ్యంగా గడపగడపకూ మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యలను ప్రతీ సచివాలయం పరిధిలోనూ రూ.20 లక్షలు కేటాయించి పరిష్కరించామన్నారు. ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి, ప్రతీ ఇంటికీ సంక్షేమాన్ని సీఎం జగన్ అందించారన్నారు. దీంతో ధైర్యంగా మంచి జరిగిందంటే ఓటు వేయమని సీఎం జగన్ అడుగుతున్నార్నారు. చంద్రబాబు కుయుక్తులు పన్నుతూ, సన్నాయి నొక్కులు నొక్కుతూ సంక్షేమంపై విమర్శలు చేస్తూ పేదవాడికి అన్యాయం చేయడానికి కుట్రలు పన్నుతున్నారన్నారు సీఎం జగన్‌కు అండగా నిలిచి సంక్షేమాన్ని మరింతగా అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కంశెట్టి చంటి, బీసీ కార్పొరేషన్ డైరెక్టరు అందే నాగ బసవన్న, ఉప సర్పంచ్ కొండేటి సురేష్, నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ కొడమంచిలి రాజు, కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన


శివదేవునిచిక్కాలలో నాడు - నేడు పనులను పరిశీలిస్తున్న యనమల నాగార్జున యాదవ్

పాలకొల్లు అర్బన్: పేద విద్యార్థులు చదువుకునే విద్యాలయాల రూపు రేఖలు మార్చి వారి మనస్సుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గూడుకట్టుకున్నారని రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వనరుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ యనమల రామకృష్ణ యాదవ్ స్పష్టం చేశారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు నేడు పథకంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం జగన్ అధికారం చేపట్టాక విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ప్రభుత్వ బడులకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చేవిధంగా మౌలిక వసతులు కల్పించారన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. నిరుపేద విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించారన్నారు. ప్రతిభ ఉన్న ప్రతి పేద విద్యార్థి పేదరికం కారణంగా చదువుకు ఆగిపోకూడదనే లక్ష్యంతో సీఎం జగన్ విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చారని వెల్లడించారు. పేద విద్యార్థులకు అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, విద్యా వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, డిజిటల్ క్లాస్ రూమ్స్, ట్యాబ్స్ తో పాటు బైజ్యూస్ సంస్థ ద్వారా మేలైన విద్యను అందిస్తున్నారని వివరించారు. పాలకొల్లు నియోజకవర్గంలోని పోడూరు, యలమంచిలి, పాలకొల్లు పట్టణ, మండలంలోని 174 ప్రభుత్వ పాఠశాలలను రూ.45.70కోట్లు ఖర్చుచేసి అభివృద్ధి చేసినట్లు ఆయన వివరించారు. అదనపు తరగతి గదులు, గ్రీన్‌బోర్డులు, విద్యుద్దీకరణ, బెంచీలు, ఫ్యాన్‌లు, బాత్‌రూమ్‌లు, ప్లంబింగ్, డిజిటల్ క్లాస్ రూమ్స్ నిర్మించినట్లు నాగార్జున యాదవ్ వివరించారు.

అభివృద్ధిని చూడలేని రామానాయుడు...

పాలకొల్లు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు డ్రామానాయుడుగా మారి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని నాగార్జున యాదవ్ హెచ్చరించారు. పాఠశాలల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో ఫేజ్-2లో రూ.48లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను ఆయన పరిశీలించారు. బాత్‌రూమ్‌లతో ట్యాపుల నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట ఈఈ సదాశివరావు, ఏఈ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం పి.రాము తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి


సీఎం సహాయనిధి ఎల్‌వోసీ అందిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు


పేరుపాలెంలో ఆలయ శంకుస్థాపన పూజా కార్యక్రమంలో పాల్గొన్న చీఫ్ విప్ ప్రసాదరాజు

నరసాపురం: సీఎం సహాయనిధి పేదలకు వరమని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఎల్బీచర్ల గ్రామానికి చెందిన జల్లి మణివర్మ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.80 వేలు విలువచేసే ఎల్‌వోసీని వారి కుటుంబ సభ్యులకు గురువారం తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పేదలు వైద్యఖర్చుల కోసం అప్పులు పాలు కాకూడదని ముఖ్యమంత్రి పరితపిస్తూ అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేయడమే కాకుండా పథకం పరిధిలో మొత్తాన్ని రూ 25 లక్షలకు పెంచారని చెప్పారు. దాదాపుగా అన్ని రోగాలకు ఆరోగ్యశ్రీ పథకంలో తెచ్చామని చెప్పారు. ఆరోగ్యశ్రీలో లేని అరుదైన వ్యాధులకు చికిత్స చేయంచుకుంటే ముఖ్యమంత్రి సహాయనిధి అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ, ఆత్మ చైర్మన్ కడలి రాంబాబు, గుబ్బల కై లాష్, రేవు నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని పేరుపాలెం సౌత్ గ్రామంలోని దిబ్బలపల్లవపాలెంలో నూతనంగా నిర్మించనున్న సుబ్రమణ్యస్వామి వారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో గురువారం చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుమాని విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ఆంద్రాజు షరాబంద్‌రాజు, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ఠ


ఉమాసోమేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: పెనుగొండలో ప్రసిద్ధ ఉమాసోమేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వారం రోజులుగా నూతనంగా నిర్మించిన ఆలయం వద్ద హోమాలు, పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం బ్రహ్మశ్రీ కేతవరపు వెంకటేశ్వరశర్మ బ్రహ్మత్వంలో వేద పండితులు చేబోలు పవన్ శర్మ ఆధ్వర్యంలో ఉమాసోమేశ్వర స్వామికి, విఘ్నేశ్వర ప్రతిష్ఠాపన పూజలు, యంత్ర విగ్రహ, లింగశిఖర, ధ్వజ ప్రతిష్ఠ, శాంతి కల్యాణం నిర్వహించారు. ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో కమిటీ సభ్యులతో పాటు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎంపీపీ పుతినీడి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

పల్స్ పోలియో కార్యక్రమంపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్‌కమిషనర్


లంకలకోడేరు పీహెచ్‌సీలో పల్స్‌పోలియోపై శిక్షణ ఇస్తున్న మెడికల్ ఆఫీసర్ డా.నవ్యజీవన్

నరసాపురం: పల్స్ పోలియో కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం పల్స్ పోలియో కార్యక్రమంపై గురువారం మున్సిపల్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారలతో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో మొత్తం 40 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం 7 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు వరకూ పోలియో చుక్కలు వేయాలన్నారు. 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి వీఎస్‌సీహెచ్ స్వనూప్, డాక్టర్ పి.సోనియా, డాక్టర్ సత్యభూషణ్ పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని మెడికల్ ఆఫీసర్ డా.నవ్యజీవన్ చెప్పారు. మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, హెల్త్ అసిస్టెంట్, అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో డా.నవ్యజీవన్ మాట్లాడారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేసే ముందు, వేసిన తరువాత పిల్లలకు ఏ ఇతర మందులు పట్టించరాదన్నారు. 3న పోలియో చుక్కలు వేయని చిన్నారులకు 4,5తేదీల్లో ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయాల్సిన బాధ్యత ఏఎన్‌ఎంలు తీసుకోవాలన్నారు. మండలంలో 35 బూత్‌లు ఏర్పాటు చేసి 3535 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్‌ఎన్ పి.ఎలిజబెత్, హెల్త్ సూపర్‌వైజర్లు ఎస్‌కే అమలేశ్వరావు, డి.కమల పాల్గొన్నారు.

పేదలకు మరింతగా సంక్షేమం జగన్‌కే సాధ్యం


శెట్టిబలిజ నాయకుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తునన ఉమాబాల

పెనుగొండ: దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, రాబోయే రోజుల్లో మరింత సంక్షేమం అందించగల మంచి మనస్సు సీఎం జగన్‌కే ఉందని నర్సాపురం పార్లమెంటు వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త గూడూరి ఉమాబాల అన్నారు. గురువారం పెనుగొండలో జిలం చెరువు, ఇందిరా శాంతి నగర్, దొంగ గూడెం, శాంతి నగర్, వేంద్రవారి వీధి, శ్రీరామ్ నగర్,బీడు, పెచ్చెట్టి వారి వీధి, చిట్టూరి వారివీధిల్లో మహిళలతో మమేకమయ్యారు. వేంద్రవారి వీధిలో శెట్టిబలిజ నాయకుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీసీబీ డైరక్టరు కూనప రెడ్డి నానాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. అడగడుగునా మహిళలు నీరాజనం పలికారు. చంద్రబాబు ఏనాడూ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. సంక్షేమాన్ని నీరుగార్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఏమాత్రం చంద్రబాబు మాటలకు మోసపోయినా సంక్షేమ పథకాల్లో కోతలు విధిస్తారన్నారు. ప్రజా సేవ చేస్తున్న వలంటీరు వ్యవస్థను రద్దు చేస్తారన్నారు. అవ్వాతాతలు మళ్లీ ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. జన్మభూమి కమిటీలో కమీషన్లకోసం పేదలను వేధిస్తారన్నారు. ఏమాత్రం మోసపోకుండా మరింత సంక్షేమ పథకాల కోసం సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పుతినీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యులు తాడి సుబ్బిరెడ్డి, బాలం లక్ష్మి, నక్కా పద్మ, చిన్నం ఏడుకొండలు, పంచాయతీ సభ్యులు పిల్లి చాముండేశ్వరరావు, దొమ్మేటి దేవీ రాజేష్, పుతినీడి శ్రీను, వెలగల శ్రీనివాస రెడ్డి, మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, పలివెల శ్రీను, సాకా సుబ్రహ్మణ్యం, జిల్లా యువజన కార్యదర్శి జెంట్రీ శ్రీను, బొక్కా అరుణ, పిల్లి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులకు సమాచారమివ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ

యలమంచిలి: అధికారులు గ్రామాలలో పర్యటిస్తున్న సమయంలో సంబంధిత గ్రామ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడం సమంజసం కాదని కాజ తూర్పు సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇరిగేషన్ అధికారులు వంతులవారీ విధానం గురించి వివరిస్తూ, నీటి ఎద్దడి గురించి కాజ తూర్పు గ్రామంలో పర్యటించానని వివరిస్తున్న సమయంలో సర్పంచ్ శ్రీనివాసరావు కాజ తూర్పు వచ్చి తనకు సమాచారం ఇవ్వకపోవడంపై ప్రశ్నించారు. దీంతో ఎంపీడీఓ పి శ్రీనివాసరావు కలగజేసుకుని అధికారులు గ్రామాల్లో పర్యటించినపుడు స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. మండల పరిషత్ సభ్యులకు తెలియకుండా మండల నిధులు కేటాయించడం, ఖర్చు చేయడంపై మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ గట్టిగా ప్రశ్నించారు. ఇకపై అలా చేయమని ఎంపీడీఓ సమాధానం ఇచ్చారు. శాఖల వారీగా జరిగిన సమీక్షలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మద్రిపూడి సురేష్ బాబు మాట్లాడుతూ వాటర్ ట్యాంకుల వద్ద విద్యుత్ మోటార్లకు కెపాసిటర్స్ బిగించడం ద్వారా విద్యుత్ బిల్లులను 20 నుంచి 30 శాతం తగ్గించవచ్చునని చెప్పారు. ఉపాధి హామీ పథకం ఇన్‌చార్జి ఏపీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు మంచి పథకం ప్రవేపెట్టిందన్నారు. రైతులెవరైనా అర ఎకరానికి మించి ఉద్యాన పంటలైన కొబ్బరి, అరటి, మామిడి, మునగ వంటి 15 రకాల పంటలను సాగుచేస్తే ప్రభుత్వం రూ. లక్షా మూడు వేల విలువైన మొక్కలు, ఎరువులు, పురుగు మందులు, సాగులో కూలీల సహాయం పూర్తిగా ఉచితంగా అందజేస్తుందన్నారు. అలాగే కొబ్బరి చెట్లు చుట్టూ పళ్లాలు కొట్టించుకోవడానికి కూలీలను ఇస్తుందన్నారు. ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున కొత్తగా మంజూరైన పనులన్నింటినీ త్వరగా ప్రారంభించాలని కోరారు. ఎండా కాలంలో ఉపాధి హామీ పనులు చేయదలిస్తే ఇప్పుడే అనుమతి తీసుకోవాలని చెప్పారు. కాజ డ్రెయిన్‌కు ఏనుగువానిలంక వద్ద ఉన్న స్లూయిజ్ తలుపులు సక్రమంగా పని చేయకపోవడం వల్ల ఏనుగువానిలంక, కాజ తూర్పు, కాజ పడమర, ఊటాడ, కలగంపూడి రైతులు ప్రతి ఏటా పంట నష్టపోతున్నారని కాజ తూర్పు, ఊటాడ సర్పంచ్‌లు పాలంకి శ్రీనివాసరావు, బుడితి జయరాజు సభలో ప్రస్తావించారు. దీనిపై కన్సర్వెన్సీ అధికారులకు చెప్తానని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు గొల్లపల్లి శ్రీనివాసరావు, కొప్పాడి శ్రీనుబాబు సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఠంచన్‌గా పింఛన్


వెలివెల గ్రామ సచివాలయంలో పింఛన్ల పంపిణీకి నగదు లెక్కిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రభుత్వ ఉద్యోగుల్లా పింఛన్‌దారులకు కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఏర్పడినప్పటి నుంచి ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తున్నారు. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్ అందించే విధానం తీసుకురావడంతో వ్యయప్రయాసలు తగ్గాయి. అయితే శుక్రవారం మార్చి నెలకు సంబంధించిన పింఛన్‌ను అందించాల్సి ఉండడంతో సచివాలయ ఉద్యోగులు గురువారం నగదు సిద్ధం చేశారు.

\- పాలకొల్లు అర్బన్

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి


భీమవరంలో జాతీయ లోక్‌అదాలత్‌పై మాట్లాడుతున్న జడ్జి ధనరాజు

భీమవరం: జాతీయ లోక్‌అదాలత్‌ను ఈ నెల 16న నిర్వహించనున్నామని, భీమవరం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్‌లోని రాజీ పడదగిన క్రిమినల్, ఎక్సైజ్, చెక్‌బౌన్స్ కేసులు రాజీ చేసుకోవాలని 2వ అధనపు సివిల్ జడ్జి డి.ధనరాజు చెప్పారు. గురువారం తన ఛాంబర్‌లో పోలీస్ అధికారులు, కోర్టు రిప్రజెంటేటివ్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి బాధితులు, ముద్దాయిలకు తక్కువ సమయంలో సమన్యాయం జరిగేలా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. క్రిమినల్ కేసులతో పాటు మనోవర్తి, భూతగదాలు, చెక్‌బౌన్స్, ఎక్సైజ్ కేసులు కూడా రాజీ చేసుకోడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో భీమవరం వన్‌టౌన్, టుటౌన్, ఉండి పోలీస్ స్టేషన్‌ల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

9న అమరావతిలో వికలాంగుల మహాగర్జన


బ్రోచర్ విడుదల చేస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: అమరావతిలో ఈ నెల 9న నిర్వహించే వికలాంగుల మహాగర్జనకు లక్షలాదిగా తరలిరావాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి డేవిడ్‌రాజు కోరారు. పాలకొల్లు ఏఎంసీ ఆవరణలో గురువారం వీహెచ్‌పీఎస్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వికలాంగుల మహా గర్జనకు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారన్నారు. జాతీయ కోర్ కమిటీ కో చైర్మన్ అందే రాంబాబు మాట్లాడుతూ అన్ని గ్రామాల నుంచి వీహెచ్‌పీఎస్ కార్యకర్తలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ఇన్‌చార్జ్‌లు బయ్యారపు రాజేశ్వరరావు, పసుపులేటి చినబాబు, జిల్లా అధ్యక్షురాలు ఆకుమర్తి విజయశాంతి పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం

పెనుమంట్ర: మండలంలోని నెలమూరు, పొలమూరు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు వివిధ అభివృద్ధి పనులకు మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రారంభోత్సవాలు చేస్తారని ఆయా గ్రామ సర్పంచ్‌లు కుచ్చర్లపాటి పద్మావతి, కాకర రాజేశ్వరరావు గురువారం తెలిపారు. పొలమూరులో సచివాలయ భవనాన్ని, సీసీ డ్రెయిన్ నిర్మాణాన్ని నెలమూరు గ్రామంలో హెల్త్ వెల్‌నెస్ భవనాన్ని ప్రారంభిస్తారని వివరించారు.